# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
నిజామాబాద్ గురువారం 16 జూలై 2026
వెల: రూ.3/- పేజీలు : 4 సంపుటి:04 సంచిక: 10
PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## సమర్థవంతంగా పోక్సో చట్టం అమలు

# జర్నలిస్టుల సమస్యలపై "టిడబ్ల్యుజేఎఫ్ జంగ్".



- ముఖ్యమంత్రి వెంటనే చొరవ తీసుకుని పరిష్కరించాలనీ డిమాండ్.
- మీడియా అకాడమీ చైర్మన్ వివక్షత ధోరణి వీడాలని వెల్లడి.
- సమాచార్ భవన్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన.
- వందలాదిగా తరలివచ్చిన జర్నలిస్టులు

నిత్యం అష్ట, కష్టాలను అనుభవిస్తున్న పాత్రికేయుల ఇబ్బందులను మానవతా దృక్పథంతో అర్థంచేసుకుని యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం హైదరాబాద్ మసాబ్ ట్యాంక్ లోని సమాచార శాఖ కమిషనరేట్ ఎదుట జరిగిన ధర్నాలో రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వందాలాది మంది జర్నలిస్టులు హాజరై...తమ సమస్యలు పరిష్కరించాలని ప్లకార్డులు పట్టుకొని పెద్దపెట్టున నినాదాలు చేశారు.

-3లో





# తెలంగాణ రైజింగ్‌కు.. అమర రాజా బలం

### దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి చేర్చడమే ప్రభుత్వ లక్ష్యం: రేవంత్ రెడ్డి

తెలంగాణను 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, దేశ జీడీపీలో రాష్ట్ర వాటాను 10 శాతానికి చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ (సీక్యూఫీ) తయారీ యూనిట్‌ను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ప్లాంట్‌ను పరిశీలించి ఆవరణలో మొక్క నాటారు. నిర్వహించిన సభలో సీఎం మాట్లాడుతూ అమర రాజా వంటి ప్రపంచస్థాయి సంస్థలు తెలంగాణ రైజింగ్--2047 లక్ష్య సాధనలో కీలక భాగస్వాములని పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్, జూలై 15
అమర రాజా సంస్థ 1983లో చిత్తూరు జిల్లాలో తొలి యూనిట్‌ను ప్రారంభించి నేడు ప్రపంచస్థాయి సంస్థగా ఎదిగిందని, చైనా, జపాన్, జర్మనీ, కొరియా వంటి దేశాల సాంకేతికతను ఆదర్శంగా తీసుకుని ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో చైనాతో పోటీ పడుతున్న సంస్థగా గుర్తింపు పొందిందని కొనియాడారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా ఈవీ రంగం మరింత ప్రాధాన్యం సంతరించుకుందని, కాలుష్య నియంత్రణలో విద్యుత్ వాహనాల పాత్ర కీలకమని చెప్పారు. దివిటిపల్లి యూనిట్‌లో ప్రస్తుతం 700 మంది పనిచేస్తుండగా, అందులో 400 మంది మహిళలు ఉండటం మహిళా సాధికారతకు నిదర్శనమని సీఎం పేర్కొన్నారు. గత ప్రభుత్వాల పరిశ్రమల విధానాల్లోని మంచి అంశాలను కొనసాగిస్తూ, మరింత మెరుగైన పారిశ్రామిక, పర్యాటక, ఆరోగ్య విధానాలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తమ ప్రభుత్వానికి పాలసీ ప్యారాలిసిస్ లేదని, పారదర్శక విధానాలతో పెట్టుబడులను ఆకర్షిస్తున్నామని స్పష్టం చేశారు. ప్రస్తుతం దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతంగా ఉన్నప్పటికీ, దానిని 10 శాతానికి పెంచడమే లక్ష్యమని తెలిపారు. పరిశ్రమల(మిగతా 2వ పేజీలో)



## అమెరికాలో 'ట్రంప్' కాయిన్

### 250వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా విడుదల

వాషింగ్టన్: అమెరికా స్వాతంత్ర్య దినోత్సవం 250 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని, ఆ దేశ అధ్యక్షు డు డొనాల్డ్ ట్రంప్ చిత్రంతో కొత్త ఒక డాలర్ నాణేన్ని ముద్రించనున్నట్లు యునైటెడ్ స్టేట్స్ మింట్ ప్రకటిం చింది. ఈ విషయాన్ని తరువాయి 2 వ పేజీలో...



## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు

### 3 వరకు దరఖాస్తుల స్వీకరణ

**ఆగస్టు 10న ముసాయిదా, అక్టోబర్ 12న తుది జాబితా**

తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. ఎన్యుమరేటర్లు వచ్చే నెల 3వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరిస్తారని స్పష్టం చేసింది. తెలంగాణ, పంజాబ్ రాష్ట్రాల్లో జూన్ 25న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 3 వరకు పొడిగించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను కూడా ఇదే తేదీలోగా పూర్తి చేయనున్నారు.

న్యూఢిల్లీ/హైదరాబాద్, జూలై 15 (ఈవార్తలు): తెలంగాణలో ఆగస్టు 10న, పంజాబ్‌లో ఆగస్టు 13న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురిస్తారు. అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు తెలంగాణలో తరువాయి 2 వ పేజీలో...



# మేడిగడ్డపై కేంద్రం తీరు దారుణం

### ఎన్డీఎస్ఏ రిపోర్టుపై కేటీఆర్ మండిపాటు

- పోలవరం విషయంలో ఒకలా..ఇక్కడ మరోలా
- రాష్ట్ర ఇంజనీర్ల నివేదికను బహిర్గతం చేయాలి
- సిసిఐని తెరిపించాలని కేంద్ర మంత్రికి వినతి

గతంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింటే.. ఎన్డీఎస్ఏ పట్టించుకోలేదు. మేడిగడ్డ పిల్లర్ కుంగితే మాత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని కేంద్రం తీరుపై కెటిఆర్ మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీపై నివేదిక ఇచ్చింది ఎన్డీఎస్ఏ కాదు.. ఎన్డీఏ అన్నారు. ఢిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ విషయంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తీరుపై కేటీఆర్ విమర్శలు చేశారు.

న్యూఢిల్లీ, జూలై 15 : తెలంగాణలో కోటి ఎకరాలకు పైగా నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ మంత్రి 30 శాతం వసూళ్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు చేస్తున్న పనులకు పొంతన లేదు. కాళేశ్వరంపై ఆయన పగబట్టి వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఇంజినీర్లు ఇచ్చిన నివేదికను బయటపెట్టాలని కెటిఆర్ ఢిల్లీలో మీడియాతో అన్నారు. గత రెండేళ్లలో కేసీఆర్ ఏ ఒక్కరి పేరు పెట్టి విమర్శలు చేయలేదు. రేవంత్‌కు మాత్రం.. కేసీఆర్ పేరు తలవని రోజు లేదు. రెండు రోజులు ఢిల్లీలోనే ఉన్న సీఎం.. ఎన్డీఎస్ఏ అధికారులను ఎందుకు కలవలేదన్నారు. ఎన్డీఎస్ఏ ప్రాథమిక నివేదికకు.. తుది నివేదికకు చాలా వ్యత్యాసం ఉంది. మేడిగడ్డపై చూపిన శ్రద్ధ.. మిగతా రాష్ట్రాలపై ఎందుకు చూపలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ పని తీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఎల్‌నినో పరిస్థితుల్లోనూ నీటి సమస్య రాకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం

-మిగతా 2 లో..

# పోలీసుల వైఫల్యం వల్లే షాబాద్ ఘటన

### బాధితులకు రక్షణ కల్పించలేకపోయారు... సీఎం రేవంత్‌కు పవన్ కల్యాణ్ లేఖ

తెలంగాణ రాష్ట్రం షాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర సామూహిక హత్యల ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక లేఖ రాశారు.



మంగళగిరి/హైదరాబాద్, జూలై 15
పోక్సో చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, బాధితులకు పూర్తిస్థాయి భద్రత కల్పించేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఉదంతాన్ని పవన్ కల్యాణ్ తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్, 16 ఏళ్ల బాధితురాలితో పాటు ఆమె తల్లి, నానమ్మను పొట్టనబెట్టుకున్నాడు. ఆ తర్వాత తనతో గొడవపడుతుందని భార్య, ఇద్దరు పిల్లలను చంపేసి, ఆపై తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ తరువాయి 2 వ పేజీలో...



# ఇదేనా మహిళలకు రక్షణ?

### ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజం

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో మహిళల భద్రత పూర్తిగా గాలికి కొట్టుకుపోయిందని, ఆడబిడ్డలను కాపాడుకునే నాథుడే కరవయ్యాడని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తెలంగాణ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా షాబాద్ దారుణ ఉదంతంపై ఆయన మాట్లాడారు. ఈ కేసులో ప్రభుత్వం, పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వ్యవహరించిన తీరు సరిగా లేదని ఆరోపించారు. మే 16వ తేదీనే బాధిత బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసిందని... నిందితుడు ఎవరో, ఏం చేశాడో వివరించినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. నిందితుడు ముందస్తు బెయిల్ తెచ్చుకునే వరకు కూడా అతన్ని అరెస్ట్ చేయకుండా కాలయాపన చేశారని మండిపడ్డారు. ఎల్బీ నగర్ పోక్సో కోర్టు ఇచ్చిన బెయిల్ ఆర్డర్‌ను తాను పరిశీలించానని, అందులో చనిపోయిన బాలిక సోదరుడు తరువాయి 2 వ పేజీలో...



-2లో

# అమెజాన్‌తో ఫ్యూచర్ సిటీకి ఊపు

### 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యం: సీఎం రేవంత్ రెడ్డి




# తెలంగాణ రైజింగ్‌కు.. అమర రాజా బలం

(మొదటి పేజీ తరువాయి)

అభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలను వేగంగా కల్పిస్తున్నామని, తెలంగాణను "క్యూర్--ప్యూర్--రేర్" ప్రాంతాలుగా విభజించి ప్రత్యేక విధానాలతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. "తెలంగాణ రైజింగ్ అన్‌స్టాపబుల్" అని సీఎం స్పష్టం చేశారు.

"ఢిల్లీకి రాజైనా తల్లికి బిడ్డనే" అన్న సామెతను ప్రస్తావిస్తూ తాను పాలమూరు బిడ్డనని, ఒకప్పుడు కరువు జిల్లాగా పేరొందిన మహబూబ్‌నగర్ నేడు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలిచే స్థాయికి చేరుకుందని అన్నారు. జిల్లాలో ట్రిపుల్ ఐటీ, ఇంజినీరింగ్ కళాశాలలు, అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు ఏర్పాటు చేశామని, బ్లూ కాలర్ ఉద్యోగాల కోసం ఏటీసీలు, పాలిటెక్నిక్ సంస్థలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

కల్వకుర్తి, భీమా, ఆర్డీఎస్, నెట్టంపాడు వంటి సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి 90 టీఎంసీలు, డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపులపై పొరుగు రాష్ట్రంతో చర్చలు జరుగుతున్నాయని వెల్లడించారు. త్వరలోనే జిల్లా ప్రజలకు శుభవార్త అందిస్తామని పేర్కొన్నారు.పాలమూరు రైతులు అమర రాజా పరిశ్రమ కోసం భూములు ఇచ్చారని గుర్తుచేస్తూ, వారికి అత్యధిక ఉద్యోగ అవకాశాలు కల్పించాలని సంస్థ యాజమాన్యాన్ని కోరారు. కొడంగల్ నియోజకవర్గంలో గతంలో ఆర్ అండ్ బీ మంత్రిగా గల్లా అరుణ మంజూరు చేసిన రహదారులు తనకు రాజకీయంగా ఎంతో ఉపయోగపడ్డాయని కూడా సీఎం ప్రస్తావించారు.

ఈ కార్యక్రమంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, మల్లు రవి, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్యేలు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తదితరులు పాల్గొన్నారు.

# అమెజాన్‌తో ఫ్యూచర్ సిటీకి ఊపు

హైదరాబాద్, జూలై 15 అమెజాన్ డేటా సెంటర్ శంకుస్థాపనతో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి కొత్త ఊపు లభిస్తుందని, ప్రపంచ స్థాయి పెట్టుబడులు, పరిశ్రమలకు తెలంగాణ మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా మారుతుందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధిలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

బుధవారం జరిగిన అమెజాన్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, "తెలంగాణ రైజింగ్--2047" విజన్‌తో రాష్ట్రాన్ని 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. వికసిత్ భారత్--2047 లక్ష్యానికి అనుగుణంగా జాతీయ జీడీపీలో తెలంగాణ వాటాను ప్రస్తుతం ఉన్న 5 శాతం నుంచి 10 శాతానికి పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఈ లక్ష్య సాధనలో పెట్టుబడులు, పరిశ్రమలు, ఉద్యోగ కల్పనే ప్రధాన పాత్ర పోషిస్తాయని పేర్కొన్న సీఎం, పరిశ్రమలకు అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, అనుమతులు వేగంగా అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రతి నెలా పరిశ్రమల పురోగతిపై సమీక్ష నిర్వహిస్తున్నామని, అమెజాన్ పెట్టుబడులపై ప్రత్యేకంగా సమీక్షిస్తామని చెప్పారు. 2034 నాటికి అమెజాన్ తెలంగాణలో లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులు పెట్టాలని ఆకాంక్షించారు. 2025 డిసెంబరులో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ద్వారా 108 దేశాలకు చెందిన మూడు వేల మంది కార్పొరేట్ ప్రతినిధులు రాష్ట్రానికి వచ్చారని గుర్తు చేశారు. ఆ సదస్సు ఫలితంగానే ఫ్యూచర్ సిటీపై అంతర్జాతీయ సంస్థల దృష్టి మరింత పెరిగిందని, అమెజాన్ డేటా సెంటర్ అందుకు నిదర్శనమని అన్నారు.

పరిశ్రమలు, పర్యాటకం, ఇంధనం, ఆరోగ్యం, క్రీడలు వంటి రంగాలకు ప్రత్యేక విధానాలు రూపొందించామని, యువతకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని తెలిపారు. అమెజాన్ వంటి ప్రపంచ దిగ్గజ సంస్థల రాకతో మరిన్ని బహుళజాతి కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా పరిశ్రమలు, ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయంతో ప్రపంచ స్థాయి నగరంగా ఎదిగిందని పేర్కొన్న సీఎం, ఇప్పుడు కాలుష్యరహిత అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఎలక్ట్రిక్ వాహనాలకు పన్ను మినహాయింపు, ఆర్టీసీ బస్సులు, ఆటోలను విద్యుత్ వాహనాలుగా మార్చే చర్యలు అదే దిశలో భాగమని వివరించారు. రాష్ట్రాన్ని క్యూర్, ప్యూర్, రేర్ ప్రాంతాలుగా విభజించి సమగ్ర అభివృద్ధి ప్రణాళికను అమలు చేస్తున్నామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్ల కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాన్ని ప్రభుత్వం ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని చెప్పారు. భూములు కోల్పోయిన రైతులకు తగిన నష్టపరిహారం, ఉపాధి అవకాశాలు కల్పించాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. ఆందోళన చేస్తున్న రైతులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని మంత్రి శ్రీధర్ బాబు, మాజీ ఎమ్మెల్యే కె. లక్ష్మారెడ్డికి సూచించిన ముఖ్యమంత్రి, అభివృద్ధి--రైతు సంక్షేమం రెండింటికీ సమాన ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు.

చివరగా అమెజాన్ సంస్థ తెలంగాణలో తన కార్యకలాపాలను మరింత విస్తరించి, రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వామిగా కొనసాగాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.



## తెలంగాణలో 'ఎస్ఐఆర్' గడువు పొడిగింపు

మొదటి పేజీ తరువాయి

సెప్టెంబర్ 9 వరకు, పంజాబ్‌లో సెప్టెంబర్ 12 వరకు అవకాశం కల్పించారు. అనంతరం, అక్టోబర్ 12న రెండు రాష్ట్రాల్లోనూ తుది ఓటర్ల జాబితాను విడుదల చేస్తారు. ఢిల్లీ, కర్ణాటక రాష్ట్రాల్లో జూన్ 30న ప్రారంభమైన ఇంటింటి సర్వే గడువును ఆగస్టు 8 వరకు పొడిగించారు. ఆగస్టు 17న ముసాయిదా జాబితాను విడుదల చేసి, సెప్టెంబర్ 16 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అన్ని ప్రక్రియలను పూర్తి చేసి, అక్టోబర్ 19న తుది ఓటర్ల జాబితాను వెల్లడిస్తారు.

## ధర్మ పరిరక్షణే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

తెలిపారు.ఈ పవిత్ర కలశాలు గ్రామాలకు చేరుకోవడం ద్వారా సమృద్ధిగా వర్షాలు కురవాలని, ప్రజలు సుఖశాం తులతో జీవించాలని, గ్రామాల్లో ఎలాంటి ఉపద్రవాలు లేకుండా అన్ని వర్గాల ప్రజల మధ్య సామరస్యం, సౌభ్రాతృ త్వం నెలకొనాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో అర్చకులు మురళీధరాచార్యులు, రామానుజాచార్యులు, అశో క్ రావు, శ్రీనివాస్ రెడ్డి, భాస్కరరావు, చకీలం వేణుగోపాల్, ఈశ్వర్ రెడ్డి, నిర్మల, విజయకుమార్ గురవయ్య, మల్లికార్జు న్, శ్రీధర్, రవీందర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



# సీసీఐపై సప్పుడు లేదు!

మొదటి పేజీ తరువాయి

చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ప్లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ప్లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు.

బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ప్లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పామన్నారు. సీసీఐ సాధన సమితి చేస్తున్న పోరాటం అభినందనీయం. మేం కూడా దీన్ని మళ్లీ నడపాలని కోరికతోనే ఉన్నామని కేంద్రమంత్రి అన్నారని కేటీఆర్ వెల్లడించారు. దాదాపు 230 ఎకరాలు అక్కడ ల్యాండ్ ఉన్నది. ఒక 770 ఎకరాలు ప్రైవేట్ పట్టా ల్యాండ్ కంపెనీకి ఉంది. అట్లాగే 1500పై చిలుకు ఎకరాలు లీజ్ ల్యాండ్ ఉంది.

మరి 2 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో కొత్త ఫ్యాక్టరీతో పెడితే బాగుంటదన్నారు. ఏమైంది ఎందుకు తెరవలేకపోతున్నరని అడిగితే రాష్ట్ర ప్రభుత్వం కొంత స్పందించడం లేదు.. సంవత్సర కాలంగా మేం ప్రయత్నం చేస్తున్నం. కానీ రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ లీజ్ పొడిగించాలి. వాళ్లు ముందుకు రావడం లేదు.

మరి రాష్ట ప్రభుత్వం ఏం సబ్సిడీ ఇస్తదా.. ఏమన్నా పెట్టుబడి పెడ్తతా..? జీఎస్టీ మినహాయింపు ఇస్తదా.. చెప్పమంటే చెప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది నుంచి పెద్దగా స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారని కేటీఆర్ వివరించారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రికి సీసీఐ సాధన సమితి తరపున ధన్యవాదాలుతెలియజేస్తూ.. మేం అధికారంలో ఉన్నప్పుడు సిర్పూర్ పేపర్ మిల్లు తెరిపించాం.

అదే ఆదిలాబాద్‌జిల్లాలో మళ్లీ వెంబడ పడి తిరిగి తెరిపించి ఇవాళ వేలాది మందికిఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినం. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే వారు ముందుకొచ్చిమైనింగ్ లీజ్‌ను ఎక్స్‌టెండ్ చేయాలి. రూ.2 వేల కోట్ల పెట్టుబడి అంటే రాష్ట్రప్రభుత్వం తరుపున మీరేం ప్యాకేజీ ఇస్తారో చెప్పాలన్నారు. సీసీఐని పునరుద్ధరిస్తామని ఎన్నికల ప్రచారంలో అమిత్ షా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారు. సీసీఐని పునరుద్ధరిస్తే వేలాదిమందికి ఉద్యోగాలు వస్తాయన్నారు.

## సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులు

(మొదటిపేజీ తరువాయి)

అధికారుల వద్ద అన్ని విధాలుగా ప్రయత్నాలు కొనసాగిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అనుమతులు లభించిన వెంటనే పనులు పునఃప్రారంభమై, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల రైతాంగానికి సాగునీటి ప్రయోజనాలు త్వరితగతిన అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ రెండు జిల్లాల్లోని వేలాది ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పూర్తయితే స్థానిక రైతాంగానికి పెద్దఎత్తున ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. సీతారామ ఎత్తిపోతల పథకంలో పంప్‌హౌస్-1, పంప్‌హౌస్-2 మధ్య దోమలవాగుపై ప్రస్తుతం ఉన్న 0.20 టీఎంసీల నిల్వ సామర్థ్యాన్ని 0.50 టీఎంసీలకు పెంచే ప్రతిపాదనపై మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో చర్చించినట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. నిల్వ సామర్థ్యం పెరిగితే ఎత్తిపోతల పథకం మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని, రెండు పంప్‌హౌస్‌ల మధ్య నీటి లభ్యత స్థిరంగా ఉంటుందని మంత్రి వివరించారు. ఈ ప్రతిపాదనకు నీటిపారుదల శాఖ మంత్రి సానుకూలంగా స్పందించారని, కార్యరూపంలోకి తీసుకురావడానికి అవసరమైన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారని మంత్రి తుమ్మల వెల్లడించారు. సీతారామ ప్రధాన కాలువపై పంప్‌హౌస్-1, 2, 3 మధ్య అవసరమైన చోట్ల ఎస్కేప్ రెగ్యులేటర్ల ఏర్పాటు అంశంపైనా విస్తృతంగా చర్చించినట్లు మంత్రి తెలిపారు. వర్షాకాలంలో అధిక వరద ప్రవాహం ఏర్పడినప్పుడు కాలువకు నష్టం వాటిల్లకుండా ఉండేందుకు, నీటి ప్రవాహాన్ని నియంత్రించేందుకు ఈ రెగ్యులేటర్లు ఎంతో దోహదపడతాయని వివరించారు. కాలువ నిర్వహణను మరింత సమర్థవంతంగా చేయడం, అధిక ప్రవాహాన్ని నియంత్రించడం లక్ష్యంగా అవసరమైన సాంకేతిక పరిశీలనలు చేపట్టాలని అధికారులను ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఆదేశించినట్లు వివరించారు. సత్తుపల్లి ట్రంక్ కాలువలోని యాతలకుంట సొరంగం తవ్వకం పూర్తయిందని, ప్రస్తుతం లైనింగ్ పనులు వేగంగా సాగుతున్నాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. 2026 ఆగస్టు నాటికి లైనింగ్ పూర్తి చేసి నీటి విడుదలకు సిద్ధం చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సొరంగం పూర్తయితే సత్తుపల్లి ప్రాంత రైతాంగానికి సాగునీటి లభ్యత మరింత మెరుగుపడుతుందని పేర్కొన్నారు. సొరంగం నిర్మాణ బిల్లుల చెల్లింపులను త్వరగా విడుదల చేస్తామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపులు సకాలంలో జరిగితే నిర్మాణ సంస్థలు మరింత వేగంగా పనులు కొనసాగించే వీలుంటుందని మంత్రి అభిప్రాయపడ్డారు. సీతారామ ప్రాజెక్టుకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న భూసేకరణ పరిహార చెల్లింపులను తక్షణమే విడుదల చేయాలని మంత్రి కోరగా, అవసరమైన చర్యలు తీసుకుంటామని ఉత్తమ్ కుమార్‌రెడ్డి హామీ ఇచ్చారు. భూసేకరణ పరిహారం అందితే బాధిత రైతులకు ఊరట లభించడంతోపాటు ప్రాజెక్టు పనులు కూడా ఎలాంటి అవాంతరాలు లేకుండా ముందుకు సాగుతాయని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. అశ్వారావుపేట, సత్తుపల్లి నియోజకవర్గాల్లో అత్యధిక భూములు ఆయిల్‌పామ్ సాగులో ఉన్నందున, సంప్రదాయ డిస్ట్రిబ్యూటరీ కాలువలకు బదులు పైపుల ద్వారా సాగునీటి పంపిణీసాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి సూచించారు. ఆయిల్‌పామ్ తోటలకు నిరంతరం, నియంత్రిత పద్ధతిలో నీరు అందించేందుకు పైప్డ్ ఇరిగేషన్ విధానం మరింత అనుకూలంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. దీనిపై సమగ్ర ప్రతిపాదనలు అత్యవసరంగా సిద్ధం చేయాలని మంత్రి ఉత్తమ్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సీతారామ ప్రధాన కాలువపై జూలూరుపాడు సొరంగం నిర్మాణం వివిధ కారణాలతో నిలిచిపోయిన విషయాన్ని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

## సమర్థవంతంగా పోక్సో చట్టం అమలు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. బాధితులకు వేగవంతమైన న్యాయం అందించేందుకు పలు కీలక ప్రతిపాదనలను ఆయన లేఖలో పొందుపరిచారు. తెలంగాణలో జరిగిన షాబాద్ ఘటనను ఉదాహరణగా ప్రస్తావించిన పవన్, బెయిల్‌పై విడుదలైన నిందితుడు ఆరుగురిని హత్య చేసిన సంఘటన తీవ్ర ఆందోళన కలిగించిందన్నారు. పోక్సో కేసుల్లో నిందితుల బెయిల్‌ను మరింత కఠినంగా పరిశీలించాలని, బాధితులు మరియు వారి కుటుంబాలకు పటిష్టమైన భద్రత కల్పించాలని సూచించారు. పోక్సో కేసులను దర్యాప్తు చేసే అధికారులకు తప్పనిసరిగా ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని ఆయన ప్రతిపాదించారు. బాలలతో సున్నితంగా వ్యవహరించడం, ఫోరెన్సిక్ ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాల సేకరణ, కేసుల నిర్వహణ వంటి అంశాలపై శిక్షణ అవసరమని పేర్కొన్నారు. బాధితుల వైద్య పరీక్షలను 24 గంటల్లో పూర్తి చేయాలని, ÷ాంఈఇ కిట్ల వినియోగంతో పాటు ఆఔెం, ఈ÷ాఒ నివేదికలను వేగంగా అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు పవన్.. ఘటన స్థలాన్ని ఫొటోలు, వీడియోలతో తప్పనిసరిగా నమోదు చేయాలని, పోక్సో కేసుల్లో దర్యాప్తు, ఛార్జిషీట్ గడువులోగా పూర్తి కావాలని పవన్ పేర్కొన్నారు. సాధారణ కేసులను 60 రోజుల్లో, క్లిష్టమైన కేసులను 90 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్ కేసులను జిల్లా ఎస్పీలు, రేంజ్ ఐజీలు ప్రతి నెల సమీక్షించాలని సూచించారు. ప్రతి పోక్సో కేసులో బాధితుల రక్షణ ప్రణాళిక తప్పనిసరిగా ఉండాలని, అవసరమైతే పోలీసు పహారా, ఎస్కార్ట్ సౌకర్యం కల్పించడంతో పాటు వన్‌స్టాప్ సెంటర్లతో అనుసంధానం చేయాలని పవన్ ప్రతిపాదించారు. బెదిరింపులకు పాల్పడే లేదా నేర చరిత్ర ఉన్న నిందితులపై రౌడీషీట్లు తెరవాలని సూచించారు. పోక్సో కేసుల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఏకరీతి స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (÷ూక్షఖ) విడుదల చేయాలని, జిల్లా, రేంజ్, రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక పోక్సో మానిటరింగ్ సెల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసు, ప్రాసిక్యూషన్, మహిళా-శిశు సంక్షేమ శాఖల మధ్య సంయుక్త సమీక్ష సమావేశాలు నిర్వహించాలని కూడా సూచించారు. పోక్సో కేసుల్లో ప్రాథమిక విచారణ పేరుతో ఆలస్యం చేయకుండా వెంటనే ఈఎఫ్ఐ నమోదు చేయాలని, ఈఎఫ్ఐ నమోదు ఆలస్యం చేసిన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ లేఖలో పేర్కొన్నారు. అలాగే పాఠశాలలు, హాస్టళ్లు, కోచింగ్ సెంటర్లు, ప్రార్థనా మందిరాల్లో పిల్లలపై లైంగిక నేరాల నివారణకు తప్పనిసరి రిపోర్టింగ్ వ్యవస్థ అమలు చేయాలని సూచించారు. పిల్లలపై లైంగిక నేరాలను సాధారణ పరిపాలనా అంశంగా కాకుండా అత్యంత ప్రాధాన్యంతో చూడాలని పవన్ స్పష్టం చేశారు. తాను సూచించిన చర్యల అమలుపై 30 రోజుల్లో కార్యాచరణ నివేదిక అందించాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరారు.

## అమృత్ భారత్ కింద రైల్వే స్టేషన్ల ఆధునీకరణ

(మొదటిపేజీ తరువాయి)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జూలై 17న వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించ నున్నారు. దీనికి సంబంధించి,'అమృత్ భారత్ స్టేషన్ పథకం' కింద హైటెక్ సిటీ రైల్వే స్టేషన్‌లో జరిగిన రూపాంతరాన్ని ప్రదర్శించడానికి మరియు పునరాభివృద్ధి ప్రాజెక్ట్ ముఖ్యవిశిష్టతలు మీడియా ప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇన్‌ఫ్రా) కె. ముత్యాల నాయుడు, దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ ఎ. శ్రీధర్, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె. శివ హర్ష,సికింద్రాబాద్ డివిజన్ డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ (గతి శక్తి) శ్రీ ఆర్. మల్లికార్జున, సికింద్రాబాద్ డివిజన్ సీనియర్ డివిజనల్ ఇంజనీర్ (కో-ఆర్డినేషన్) శ్రీ ఎస్.వరుణ్ బాబు మరియు ఇతర ఉన్నతాధికారులు కూడా హాజరయ్యారు. సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే ముఖ్య ప్రజా సంబంధాల అధికారి శ్రీధర్ మీడియా ప్రతినిధులకు ముఖ్యమైన వివరాలు తెలియజేశారు. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద భారతదేశవ్యాప్తంగా 1300కు పైగా రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. దీనిలో భాగంగా, తెలంగాణ రాష్ట్రంలో రూ. 2000 కోట్లకు పైగా వ్యయంతో 40 రైల్వే స్టేషన్లను పునరాభివృద్ధి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.హైదరాబాద్ నగర పశ్చిమ కారిడార్‌లో ఉన్న హై-టెక్ సిటీ రైల్వే స్టేషన్‌ను రూ.26 కోట్ల వ్యయంతో పునరాభివృద్ధి చేసినట్లు సీపీఆర్ఓ తెలియజేశారు. ఈ స్టేషన్‌లో ప్రస్తుతం 12 మీటర్ల వెడల్పు గల పాదచారుల వంతెన, అదనపు లిఫ్టులు, ఎస్కలేటర్లు, ప్రయాణీకులకు అనుకూలమైన సూచికలు, మెరుగైన స్టేషన్ ముఖభాగం, కొత్త పోర్టికో వంటి ఆధునిక సౌకర్యాలు ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రయాణీకులకు గానీ, రైలు సేవలకు గానీ ఎలాంటి పెద్ద అసౌకర్యం కలగకుండా ఉండేందుకు పునరాభివృద్ధి పనులను దశలవారీగా చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. హైటెక్ సిటీ రైల్వే స్టేషన్ అభివృద్ధి భారతీయ రైల్వేల దూరదృష్టికి ప్రతీకగా నిలుస్తూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశ ఆర్థిక కేంద్రాలకు ప్రపంచ స్థాయి పట్టణ రవాణా మౌలిక సదుపాయాలను అందించాలనే సంకల్పానికి మరో మైలురాయిగా నిలిచింది. విశాలమైన ప్రయాణికుల ప్రాంగణాలు, విమానాశ్రయ స్థాయిలో ఆధునిక సౌకర్యాలు, సమకాలీన శిల్పకళా వైభవం, ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన స్మార్ట్ ప్రణాళికతో ఈ స్టేషన్ సరికొత్త రూపును సంతరించుకుని, ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన హైదరాబాద్ ఐటీ కారిడార్ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రయాణికులకు అత్యున్నత ప్రయాణ అనుభవాన్ని అందిస్తుంది.దేశంలోని అగ్రశ్రేణి సాంకేతిక మరియు ఆవిష్కరణకేంద్రాలలో ఒకటిగా వ్యాపారాలను, నిపుణులను, విద్యార్థులను మరియు ప్రపంచవ్యాప్త ప్రతిభావంతులను ఆకర్షిస్తూనే ఉన్నందున, ఈ స్టేషన్ యొక్క ఆధునిక మౌలిక సదుపాయాలు సుస్థిర పట్టణ రవాణాకు మరియు నిరాటంకమైన బహుళ రవాణా అనుసంధానానికి మద్దతు ఇవ్వడంలో కీలక పాత్ర పోషిస్తాయి. రూపాంతరం చెందిన ఈ రైల్వే స్టేషన్ కేవలం ఒక రవాణా కేంద్రం మాత్రమే కాదు; భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చెందుతున్నవికసిత భారతానికి ప్రతిబింబం. ఆవిష్కరణలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అత్యాధునికంగా తీర్చిదిద్దుతూ, ప్రపంచ ఐటీ గమ్యస్థానంగా హైదరాబాద్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రయాణికులకు మరింతస్మార్ట్, సురక్షితమైన, ప్రపంచ స్థాయి వాస్తవ రైలు ప్రయాణ అనుభవాన్నిఅందించేలా ఈ స్టేషన్ రూపుదిద్దుకుందన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై "టిడబ్ల్యుజేఎఫ్ జంగ్".













- ముఖ్యమంత్రి వెంటనే చొరవ తీసుకుని పరిష్కరించాలనీ డిమాండ్. మీడియా అకాడమీ చైర్మన్ వివక్షత ధోరణి వీడాలని వెల్లడి.
- సమాచార్ భవన్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన. వందలాదిగా తరలివచ్చిన జర్నలిస్టులు

**వేగుచుక్క న్యూస్,హైదరాబాద్, జులై 15:**

దీర్ఘకాలికంగా పెండింగ్ లో ఉన్న జర్నలిస్టుల సమస్యలను ఆలస్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. నిత్యం అష్ట, కష్టాలను అనుభవిస్తున్న పాత్రికేయుల ఇబ్బందులను మానవతా దృక్పథంతో అర్థంచేసుకుని యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. బుధవారం హైదరాబాద్ మసాబ్ ట్యాంక్ లోని సమాచార శాఖ కమిషనరేట్ ఎదుట జరిగిన ధర్నాలో రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన వందాలాది మంది జర్నలిస్టులు హాజరై...తమ సమస్యలు పరిష్కరించాలని ప్లకార్డులు పట్టుకొని పెద్దపెట్టున నినాదాలు చేశారు. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, హెల్త్ కార్డులు, ఉచిత ఆర్టీసీ బస్సు, మెట్రో రైలు పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ అక్రిడిటేషన్ కార్డుల జారీ లో పక్షపాతం చూపుతున్నారని ఫెడరేషన్ నాయకులు ఆవేదన వ్యక్తం చేసారు. అర్హులైన జర్నలిస్తులు అందరికీ అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. యూనియన్ల పేర విభజన రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు. జర్నలిస్టుల పట్ల వివక్ష చెల్లదని స్పష్టం చేసారు. మీడియా అకాడమీ జర్నలిస్టులు అందరి తరపున బాధ్యత తీసుకోవాలని సూచించారు. వివక్షకు తావులేకుండా... మీడియా అకాడమీ శిక్షణా తరగతులు నిర్వహించాలని కోరారు. స్టేట్ లెవెల్ అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో దరఖాస్తులు తిరస్కరించి.. తరువాత తమకు నచ్చిన వారికే కార్డులు ఇవ్వడాన్నీ ఫెడరేషన్ తప్పు పట్టింది. ప్రజా స్వామ్య వ్యవస్థలో నియంతృత్వం చెల్లదని హెచ్చరించింది.

**ధర్నాకు అధ్యక్షత వహించిన ఫెడరేషన్ రాష్ట్ర యాక్టింగ్ ప్రెసిడెంట్ పి రాంచందర్, ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య మాట్లాడుతూ..**

జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర, జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కమిటీ ల్లో అనధికారికంగా నియమించిన వారిని తొలగించాలనీ, ఈ విషయం పై విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. పదవుల్లో ఉన్న పెద్దమనుషులు మీడియా కు, ప్రభుత్వానికి గుర్తింపు వచ్చేలా వ్యవహరించాలి కానీ, బద్నాం చేసేలా నడుచుకోవద్దాని ఫెడరేషన్ హితవు పలికింది. ముఖ్యమంత్రి హామీ ఇచ్చినట్టుగా ఫ్యూచర్ సిటీ లో ఇండ్ల స్థలాల ప్రక్రియ ను ప్రారంభించాలనీ, క్యాబినెట్ సబ్ కమిటీకి తగిన ఆదేశాలివ్వాలని ముఖ్యమంత్రిని ఫెడరేషన్ నాయకులు కోరారు. ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో జర్నలిస్టులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఉచితంగా ఆర్టీసీ బస్సు, మెట్రో రైలు పాసులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రైల్వే పాసుల పునరుద్ధరణకు సంబంధించి కేంద్రం పై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తేవాలనీ, ప్రధానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలని కోరారు.

**ఫెడరేషన్ ఉపాధ్యక్షులు ఎల్గోయి ప్రభాకర్, తాటికొండ కృష్ణ, బి రాజశేఖర్ మాట్లాడుతూ,**

జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో జాప్యం సరికాదనీ, ముఖ్యమంత్రి వెంటనే చొరవ తీసుకుని పరిష్కరించాలన్నారు. డీజే ఎఫ్ టి ప్రధాన కార్యదర్శి మస్తాన్ మాట్లాడుతూ, డెస్క్ జర్నలిస్టులకు పూర్తి స్థాయిలో అక్రిసిటేషన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిగ రఘు, రాష్ట్ర కార్యదర్శులు చంద్రశేఖర్, గంద్ర నవీన్, మాణిక్ ప్రభు, సలీమా, నిరంజన్, కుంచె వెంకటేష్, దామోదర్, ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, శ్రీనివాస రెడ్డి, నాయకులు దువ్వా సాగర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శేరిబాయి గణేష్, మేడ్చల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మల్లేష్ గౌడ్, రవి నాయక్, నాయకులు హరి ప్రసాద్, సూర్యాపేట జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఐ రాంబాబు, బి రాంబాబు, నాగర్ కర్నూల్ కార్యదర్శి వెంకటస్వామి, నాయకులు రాంచందర్, వనపర్తి అధ్యక్షుడు రాము, నాయకులు జ్ఞానేశ్వర్, జోగులాంబ గద్వాల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, అక్రెడిటేషన్ కమిటీ సభ్యులు జాన్, నాయకులు రంగముని, ఫెడరేషన్ నాయకులు శశికళ, విజయ, మణిమాల. రాణి, రేనయ్య, భాస్కర్, జే ఎన్ జే నాయకులు అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ ఆసుపత్రిలో అనేక సమస్యలు..

**మరమ్మతులపై దృష్టి సారించాలి..వచ్చే సమావేశానికల్లా పరిష్కరించాలి..**

**హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ సమావేశంలో అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్...**

**వేగుచుక్క న్యూస్, నిజామాబాద్:**



ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అనేక సమస్యలు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా తెలిపారు. జిల్లా జనరల్ ఆసుపత్రి డెవలప్మెంట్ సొసైటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆసుపత్రిలోని ప్రతి విభాగం అధికారులు సిబ్బంది బాధ్యతగా పనిచేయాలన్నారు. ప్రధానంగా వైద్యులు హాజరు విషయంలో రాజీ పడేది లేదని, ప్రతి ఒక్కరు నాణ్యమైన సేవలు అందించాలని కోరారు. ఆసుపత్రిలో సివిల్ వర్క్ సమస్యలు అనేకంగా నెలకొన్నాయని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. చాలా సమయాల్లో ల్యాబ్, ఎక్స్ రే తదితర వాటికోసం వచ్చే వారికి ఇబ్బందులు కలుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. అలాగే కొందరు కిందిస్థాయి సిబ్బంది రోగుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రతి విభాగాధిపతి సిబ్బంది పనితీరుపై పర్యవేక్షణ చేయాలన్నారు. అధికారులు సిబ్బంది సమన్వయంతో విధులు నిర్వహిస్తూ రోగులకు ఉత్తమమైన వైద్య సేవలు అందించాలని సూచించారు. వచ్చే సమావేశానికల్లా సమస్యలన్నీ పరిష్కారం అయ్యే విధంగా చొరవ తీసుకోవాలని తెలిపారు. ప్రధానంగా పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, మేయర్ కూరగాయల ఉమారాణి, డిఎంహెచ్వో రాజశ్రీ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములు పాల్గొన్నారు.



## విద్యార్థుల భవిష్యత్తుకు నాదీ భరోసా

**కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ బడుల అభివృద్ధి**

**రూ.వెయ్యి కోట్లతో ఆగస్టు 15 నాటికి 27.50 లక్షల ఎడ్యుకేషన్ కిట్లు**

**వనపర్తి జిల్లాలో బాలికల హైస్కూల్ భవనం ప్రారంభించిన సీఎం**

కొత్తకోట, జూలై 15: తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులే అత్యంత కీలక పాత్ర పోషించాలని, పలుగు-పార పట్టిన చేతులే కలాలు పట్టి తెలంగాణ రాత మార్చాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. ప్రభుత్వ బడులను కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్దాలని శపథం పూని పనిచేస్తున్నానని ఆయన ప్రకటించారు. వనపర్తి జిల్లా కొత్తకోటలో నూతనంగా నిర్మించిన బాలికల ఉన్నత పాఠశాల భవనాన్ని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి తదితరులు ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కొద్దిసేపు ముచ్చటించిన సీఎం.. అనంతరం బహిరంగ సభలో ప్రసంగించారు. గత ప్రభుత్వం విద్యా రంగాన్ని తీవ్రంగా నిర్లక్ష్యం చేసిందని, కనీస మౌలిక వసతులు లేకపోవడం వల్లే విద్యార్థులు ప్రైవేటు బడుల బాట పట్టారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాక విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టిందని, ప్రస్తుతం ఒక్కో విద్యార్థిపై ఏడాదికి రూ.1.08 లక్షలు ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు.

**ఆగస్టు 15 నాటికి ఎడ్యుకేషన్ కిట్లు**

ప్రభుత్వ బడుల్లో చదివే 27.50 లక్షల మంది విద్యార్థులకు రూ.1000 కోట్లకు పైగా ఖర్చుతో 9 రకాల వస్తువులతో కూడిన తెలంగాణ ఎడ్యుకేషన్ కిట్లను ఆగస్టు 15వ తేదీ లోపు అందిస్తామని సీఎం రేవంత్ ప్రకటించారు. కిట్లు అందుకున్న తర్వాత వస్తువుల నాణ్యతపై విద్యార్థులు నేరుగా వాట్సాప్ ద్వారా ఫీడ్‌బ్యాక్ ఇచ్చేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వం రాగానే ఉపాధ్యాయులకు 16 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, పదేళ్లుగా జరగని బదిలీలను చేపట్టామని, 317 జీవోతో చెదిరిపోయిన కుటుంబాలను ఒకచోట చేర్చామని గుర్తుచేశారు. ఈ చర్యలతో కేంద్రం ప్రకటించిన గ్రేడింగ్ ఇండెక్స్‌లో తెలంగాణ 36వ స్థానం నుంచి 18కి ఎదిగిందని, టాప్-2లో నిలిచేలా కృషి చేయాలన్నారు. ఉత్తమ విద్యావిధానం అధ్యయనానికి ఇప్పటికే 50 మంది టీచర్లను విదేశాలకు పంపామని, వచ్చే ఏడాది 150 మందిని పంపుతామన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజున ప్రతిభ కనబరిచిన టీచర్లకు అవార్డులు ఇస్తామన్నారు.

**బ్లూ కాలర్ జాబ్స్.. క్రీడలకు ప్రోత్సాహం**

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విప్లవంతో భవిష్యత్తులో వైట్ కాలర్ జాబ్స్ ప్రమాదంలో పడతాయని, అందుకే యువతలో స్కిల్స్ పెంచి బ్లూ కాలర్ జాబ్స్ అందించేలా జర్మన్, జపనీస్ వంటి భాషలు నేర్పిస్తున్నామని సీఎం వివరించారు. విద్యార్థులు కేవలం చదువుకే పరిమితం కాకుండా, మైదానాల్లోనూ పోటీపడాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని, మహ్మద్ సిరాజ్, నిఖత్ జరీన్ తరహాలో క్రీడల్లో రాణించే వారిని ఉన్నతస్థాయిలో నిలిపే బాధ్యతను ప్రభుత్వం తీసుకుంటుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు.



## ఇంద్రకీలాద్రిపై వైభవంగా ఆషాఢ సారె ఉత్సవాలు

**కనకదుర్గమ్మకు తొలి సారె సమర్పించిన వైదిక సిబ్బంది**

**మేళతాళాలు, వేదఘోషల మధ్య వైభవంగా సారె ఊరేగింపు**

విజయవాడ, జూలై 15: ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢ మాస ఉత్సవాలు బుధవారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా దేవస్థానం వైదిక సిబ్బంది, స్థానాచార్యులు, ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి తొలి సారెను అత్యంత వైభవంగా సమర్పించారు. ఉదయం ఘాట్‌రోడ్డు 'ఓం మలుపు' నుంచి వైదిక సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పసుపు, కుంకుమ, గాజులు, చీర తదితర సారె సంభారాలను నెత్తిన మోసుకుంటూ మేళతాళాలు, కోలాటాలు, వేదమంత్రోచ్చారణల మధ్య శోభాయమానంగా ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. చిన్న రాజగోపురం వద్ద వారికి ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, ధర్మకర్తల మండలి సభ్యులు, దేవస్థానం సిబ్బంది ఘన స్వాగతం పలికారు.

అనంతరం అమ్మవారి మూలవిరాట్ దర్శనం చేసిన వైదిక బృందం మహామండపం ఆరో అంతస్తులోని ఉత్సవమూర్తి సమక్షంలో తొలి సారె సంభారాలను సమర్పించింది. ఈ సందర్భంగా అర్చకులు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి లోకక్షేమం కోసం ప్రార్థనలు చేశారు. సారె సమర్పించిన వైదిక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులకు వేద ఆశీర్వచనాలు అందించి, అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు. ఆషాఢ మాసంలో కనకదుర్గమ్మను ఇంటి ఆడపడుచుగా భావించి సారె సమర్పించడం హైందవ సంప్రదాయంలో విశిష్టమైన ఆచారమని ఆలయ అధికారులు తెలిపారు. ప్రతి ఏడాది వైదిక సిబ్బంది సమర్పించే తొలి సారెతో ఆషాఢ సారె ఉత్సవాలకు శ్రీకారం చుట్టడం ఆనవాయితీగా కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన స్థానాచార్యులు వి. శివ ప్రసాద్ శర్మ, ప్రధాన అర్చకులు ఎల్. దుర్గా ప్రసాద్, కోట ప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు బి. శంకర శాండిల్య, కోట రవికుమార్, ఇతర అర్చకులు, వైదిక సిబ్బంది, సంప్రదాయ పాఠశాల విద్యార్థులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## ఫ్రాన్స్‌ను మట్టికరిపించిన స్పెయిన్

**టెక్సాస్, జులై 15 :**

ఫిఫా ప్రపంచకప్--2026లో స్పెయిన్ అద్భుత ప్రదర్శనతో ఫైనల్‌కు దూసుకెళ్లింది. హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగిన ఫ్రాన్స్‌ను 2--0 గోల్స్ తేడాతో ఓడించి టైటిల్ పోరుకు అర్హత సాధించింది. టెక్సాస్‌లోని డల్లాస్ స్టేడియంలో జరిగిన తొలి సెమీఫైనల్‌లో స్పెయిన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. 2010లో ప్రపంచకప్ గెలిచిన తర్వాత మరోసారి ఫైనల్‌లో అడుగుపెట్టడం స్పెయిన్‌కు ఇదే తొలిసారి.

మ్యాచ్ ఆరంభం నుంచే దూకుడుగా ఆడిన స్పెయిన్‌కు 22వ నిమిషంలో పెనాల్టీ లభించింది. యువ ఆటగాడు లామిన్ యమాల్‌పై ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ డిగ్నే ఫౌల్ చేయడంతో రిఫరీ పెనాల్టీ ఇచ్చారు. ఆ అవకాశాన్ని మికెల్ ఒయర్‌జాబల్ సద్వినియోగం చేసుకుని తొలి గోల్ నమోదు చేశాడు. అనంతరం 58వ నిమిషంలో దానీ ఓల్మోతో చక్కటి పాస్‌ల మార్పిడి అనంతరం పెడ్రో పోరో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపి స్పెయిన్ ఆధిక్యాన్ని 2--0కు పెంచాడు.

ఫ్రాన్స్ తరఫున కైలియన్ ఎంబాపే, ఉస్మాన్ డెంబెలే, మైఖేల్ ఒలిసే వంటి స్టార్ ఆటగాళ్లు బరిలో ఉన్నప్పటికీ స్పెయిన్ కట్టుదిట్టమైన రక్షణను ఛేదించలేకపోయారు. స్పెయిన్ డిఫెన్స్ ముందు ఫ్రాన్స్ దాడులు పూర్తిగా విఫలమయ్యాయి. దీంతో వరుసగా మూడో ప్రపంచకప్ ఫైనల్‌కు చేరాలన్న ఫ్రాన్స్ ఆశలు గల్లంతయ్యాయి. 14 ఏళ్లుగా జట్టును నడిపిస్తున్న కోచ్ డిడియర్ డెషాంప్స్‌కు ఈ ఓటమి నిరాశ మిగిల్చింది.

విజయం అనంతరం స్పెయిన్ ప్రధాన కోచ్ లూయిస్ డి లా ఫ్యూయెంటె జట్టు సమష్టి ప్రదర్శనను ప్రశంసించాడు. ఫ్రాన్స్ బలమైన దాడులను సమర్థంగా అడ్డుకోవడంలో ఆటగాళ్లు విజయవంతమయ్యారని పేర్కొన్నాడు. ఆదివారం న్యూజెర్సీలోని న్యూయార్క్--న్యూజెర్సీ స్టేడియంలో జరిగే ఫైనల్‌లో అర్జెంటీనా--ఇంగ్లండ్ రెండో సెమీఫైనల్ విజేతతో స్పెయిన్ తలపడనుంది.

## అర్జెంటీనాపై వివాదం



వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...



# ఈ వారం ఓటీటీ వినోదాల సందడి

సినీ అభిమానులకు ఈ వారం వినోదాల పండుగ సిద్ధమైంది. ఒకవైపు థియేటర్లలో పలు తెలుగు చిత్రాలు ప్రేక్షకుల ముందుకు రానుండగా, మరోవైపు ఓటీటీ వేదికలపై కూడా ఆసక్తికరమైన సినిమాలు, వెబ్ సిరీస్‌లు విడుదలకు సిద్ధమయ్యాయి. ముఖ్యంగా సమంత ప్రధాన పాత్రలో నటించి నిర్మించిన 'మా ఇంటి బంగారం' డిజిటల్ ప్రీమియర్ ఈ వారంలోనే జరగనుండటంతో సినీ అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. తెలుగు సినిమాలతో పాటు భారీ హాలీవుడ్ చిత్రం కూడా విడుదల కానుండటంతో ఈ వారాంతం ప్రేక్షకులకు పూర్తి వినోదాన్ని అందించనుంది. థియేటర్లలో ఈ వారం పలు విభిన్న కథాంశాలతో సినిమాలు విడుదల కానున్నాయి. తిరువీర్, ఐశ్వర్య రాజేశ్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన 'ఓ సుకుమారి' ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఆర్. మాధవన్ నటించిన 'జీడీఎన్' కూడా విడుదల కానుంది. సుమంత్ ప్రధాన పాత్రలో రూపొందిన 'మహేంద్రగిరి వారాహి'తో పాటు 'రాజా ది రాజా', 'ఆపరేషన్ అరుణారెడ్డి' చిత్రాలు కూడా ఈ వారమే ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యాయి. అంతేకాకుండా ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి రేపుతున్న హాలీవుడ్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన 'ది ఒడిస్సీ' కూడా భారీ స్థాయిలో విడుదల కానుండటంతో సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఓటీటీ వేదికల్లో కూడా ఈ వారం భారీ సందడి కనిపించనుంది. సమంత నటించిన 'మా ఇంటి బంగారం' చిత్రం జులై 17 నుంచి జియో హాట్‌స్టార్‌లో ప్రసారం కానుంది. థియేటర్లలో ఘన విజయం సాధించి వంద కోట్ల రూపాయలకు పైగా వసూళ్లు సాధించిన ఈ చిత్రంలో కుటుంబం కోసం పోరాడే మహిళ కథను దర్శకురాలు నందినీ రెడ్డి భావోద్వేగంగా తెరకెక్కించారు. ఈ డిజిటల్ విడుదల కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. జియో హాట్‌స్టార్‌లో 'సెకండ్ లవ్', 'పవిత్రం', 'వుథరింగ్ హైట్స్', 'రెడీ ఆర్ నాట్--2', 'టెస్ట్ సబ్జెక్ట్--5' వంటి చిత్రాలు, కార్యక్రమాలు కూడా ఈ వారం అందుబాటులోకి రానున్నాయి. అలాగే నెట్‌ఫ్లిక్స్‌లో 'ది హాక్', 'మీ బిఫోర్ మీ', 'ది మ్యాప్ ఆఫ్ లాంగింగ్', 'ది ఈస్ట్ ప్యాలెస్', 'డిజైర్', '23,000 లైవ్స్', 'హార్ట్ స్టాప్ ఫరెవర్', 'స్పూకీ ఇన్ లవ్' వంటి అంతర్జాతీయ చిత్రాలు, వెబ్ సిరీస్‌లు విడుదల కానున్నాయి. అమెజాన్ ప్రైమ్ వీడియోలో 'మర్డర్ 101', 'బ్యాక్ రూమ్స్', 'రైడ్ ఆర్ డై' వంటి కొత్త కంటెంట్ ప్రేక్షకులను అలరించనుండగా, జీ5లో 'ట్రాన్స్‌ఫర్ త్రిమూర్తులు', ఆపిల్ టీవీ ప్లస్‌లో 'లక్కీ', ఎంఎక్స్ ప్లేయర్‌లో 'రక్తాంచల్' మూడో భాగం కూడా ఈ వారంలో విడుదల కానున్నాయి. మొత్తంగా చూస్తే ఈ వారం థియేటర్లలో యాక్షన్, కుటుంబ కథా చిత్రం, థ్రిల్లర్, వినోదాత్మక చిత్రాలు ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతుండగా, ఓటీటీ వేదికలు కూడా విభిన్న భాషల సినిమాలు, వెబ్ సిరీస్‌లతో వినోదాన్ని అందించనున్నాయి. ముఖ్యంగా 'మా ఇంటి బంగారం' డిజిటల్ ప్రీమియర్ ఈ వారంలో సినీ అభిమానులు అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న విడుదలగా నిలిచింది.



# జపాన్‌లో నిరాశపరిచిన 'ధురంధర్'

బాలీవుడ్ స్టార్ హీరో రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో రూపొందిన 'ధురంధర్' చిత్రం ప్రపంచవ్యాప్తంగా మంచి విజయాన్ని అందుకున్నప్పటికీ, జపాన్‌లో మాత్రం ఆశించిన స్థాయిలో ప్రేక్షకాదరణను సొంతం చేసుకోలేకపోయింది. భారీ అంచనాల మధ్య జులై 10న జపాన్‌లో సుమారు 80 ప్రదర్శన మందిరాల్లో విడుదలైన ఈ చిత్రం తొలి రోజు అత్యంత నిరాశాజనకమైన స్పందనను నమోదు చేసింది. విడుదలకు ముందే విస్తృత ప్రచారం నిర్వహించినప్పటికీ, అక్కడి ప్రేక్షకులను ఆకర్షించడంలో చిత్రం విఫలమైందని సినీ వర్గాలు చెబుతున్నాయి. జపాన్‌లో భారతీయ చిత్రాలకు ఇటీవలి కాలంలో మంచి ఆదరణ లభిస్తున్న నేపథ్యంలో 'ధురంధర్' కూడా అదే స్థాయిలో రాణిస్తుందని భావించారు. అయితే తొలి రోజు మధ్యాహ్నం వరకు కేవలం 57 ప్రదర్శన మందిరాల్లోనే 449 మంది ప్రేక్షకులు సినిమా వీక్షించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. సాయంత్రం, రాత్రి ప్రదర్శన లతో కలిపి చూసినా పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించలేదు. మొత్తం మీద తొలి రోజు అన్ని ప్రదర్శన మందిరాల్లో కలిపి సుమారు 900 టికెట్లు మాత్రమే విక్రయించబడినట్లు సమాచారం. దీంతో వారాం తపు అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో కూడా ఈ సినిమా చోటు దక్కించుకోలేకపోయింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఇటీవల జపాన్‌లో విడుదలైన 'పుష్ప--2' చిత్రం కూడా ఆశించిన స్థాయిలో ప్రారంభ వసూళ్లు సాధించలేక పోయింది. ఆ చిత్రం తొలి రోజు 886 టికెట్లు మాత్రమే విక్రయించగా, 'ధురంధర్' 900 టికెట్లతో స్వల్పంగా మెరుగైన ఆరంభాన్ని నమోదు చేసింది. అయినప్ప టికీ రెండు చిత్రాలు భారీ ఓపెనింగ్‌ను అందు కోలేకపోవడం విశేషంగా మారింది.

ఇక జపాన్‌లో భారతీయ చిత్రాల తొలి రోజు టికెట్ విక్రయాల విషయానికి వస్తే, దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కించిన 'ఆర్‌ఆర్‌ఆర్' ఇప్పటికీ అగ్రస్థానంలో కొనసాగుతోంది. విడుదలైన మొదటి రోజే 8,230 టికెట్లు విక్రయించి భారతీయ సినిమాలకు కొత్త రికార్డు నెలకొల్పింది. ఆ తర్వాత 'సాహో', 'కల్కి 2898', 'పఠాన్', 'సలార్', 'జవాన్', 'రంగస్థలం', 'దేవర', 'బాహుబలి--2', 'టైగర్--3' వంటి చిత్రాలు కూడా మంచి ప్రారంభాన్ని నమోదు చేశాయి. ముఖ్యంగా 'టైగర్--3' తొలి రోజే సుమారు 1,300 టికెట్లు విక్రయించి మెరుగైన ఆరంభాన్ని అందుకుంది.

ప్రస్తుతం 'ధురంధర్'కు జపాన్‌లో వచ్చిన స్పందన ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అయితే తొలి రోజు వసూళ్ల ఆధారంగా సినిమా భవితవ్యాన్ని నిర్ణయించలేమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ప్రేక్షకుల నుంచి సానుకూల స్పందన పెరిగితే రాబోయే రోజుల్లో వసూళ్లు మెరుగుపడే అవకాశం ఉందని చెబుతున్నారు. జపాన్ ప్రేక్షకుల

# బ్రిగిడా సాగాకు నిశ్చితార్థం



చెన్నై, జులై 14 (రుద్రన్యూస్) :

తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి బ్రిగిడా సాగా జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఇటీవల తన ప్రేమ విషయాన్ని అభిమానులతో పంచు కున్న ఆమె, ఇప్పుడు తన ప్రియు డు అనంత్‌తో నిశ్చితార్థం చేసుకుని మరో శు భవార్తను ప్రకటించింది. కుటుంబ సభ్యు లు, అత్యంత సన్నిహితుల సమక్షంలో జరిగిన ఈ వేడుకకు సంబంధించిన ఫొటోలను బ్రిగిడా స్వయం గా సామాజిక మాధ్యమాల్లో పంచుకోవడంతో అవి క్షణాల్లోనే వైరల్‌గా మారాయి. అభిమానులతో పాటు సినీ ప్రముఖులు కూడా ఈ జంటకు శు భాకాంక్షలు తెలుపుతున్నారు. బ్రిగిడా సాగా తమిళ టెలివిజన్, వెబ్ సిరీస్‌లు, సినిమాల ద్వారా నటిగా మంచి గుర్తింపు సంపాదించింది. తెలుగులో 'ఆహా కళ్యాణం' వెబ్ సిరీస్‌తో ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, తన సహజ నటనతో ఆకట్టుకుంది. అనంతరం 'సింధూరం', 'పెదకాపు' వంటి చిత్రాల్లో కీలక పాత్రలు పోషించి తెలుగు ప్రేక్షకులకు మరింత చేరువైంది. విభిన్న పాత్రలను ఎంచుకుంటూ నటిగా తనకంటూ ప్రత్యేక గుర్తింపును ఏర్పరచుకున్న బ్రిగిడా ప్రస్తుతం తమిళ, తెలుగు భాషల్లో పలు చిత్రాలతో బిజీగా ఉంది.

కొద్ది రోజుల క్రితమే కోలీవుడ్ నటుడు అనంత్‌తో ప్రేమలో ఉన్నట్లు బ్రిగిడా అధికారికంగా ప్రకటించింది. అనంత్ పుట్టినరోజు సందర్భంగా ఆయనతో కలిసి దిగిన చిత్రాలను పంచుకుంటూ తమ ప్రేమను అభిమానులతో పంచుకుంది. ఆ ప్రకటన అనంతరం ఈ జంట పెళ్లి చేసుకోబోతున్నారనే ప్రచారం సాగుతుండగా, తాజాగా నిశ్చితార్థం జరగడంతో ఆ వార్తలకు అధికారిక ముద్ర పడింది. సోమవారం సాయంత్రం అత్యంత సన్నిహితుల సమక్షంలో సంప్రదాయ పద్ధతిలో ఈ వేడుక జరిగినట్లు సమాచారం.

నిశ్చితార్థ వేడుకలో సంప్రదాయ దుస్తుల్లో మెరిసిన బ్రిగిడా, అనంత్ ఎంతో ఆనందంగా కనిపించారు. ఈ సందర్భంగా తీసుకున్న అందమైన చిత్రాలను బ్రిగిడా తన సామాజిక మాధ్యమాల ఖాతాల్లో పంచుకోగా, అభిమానులు భారీగా స్పందిస్తున్నారు. సినీ పరిశ్రమకు చెందిన పలువురు నటీనటులు, దర్శకులు, నిర్మాతలు ఈ జంటకు శుభాకాంక్షలు తెలియజేస్తుండగా, అభిమానులు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



# మళ్లీ సాధారణ జీవితంలోకి...

ఒకప్పుడు తెలుగు సినీ పరిశ్రమలో ప్రత్యేక గీతాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న నటి ముమైత్ ఖాన్ చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉన్నారు. అయితే ఇటీవల ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన జీవితంలో జరిగిన అత్యంత విషాదకర ఘటనను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. తాను సినిమాలకు దూరం కావడానికి కారణమైన ప్రమాదం గురించి ఆమె తొలిసారిగా విపులంగా వివరించారు.

ముమైత్ ఖాన్ మాట్లాడుతూ, కొన్ని సంవత్సరాల క్రితం తన ఇంట్లోనే జరిగిన ప్రమాదం తన జీవితాన్ని పూర్తిగా మార్చేసిందని తెలిపారు. ఒక రోజు స్నానం చేసి గదిలోకి వచ్చిన తర్వాత వార్డ్‌రోబ్ అద్దం దగ్గరకు వెళ్లానని, అక్కడి నుంచి తిరిగి వస్తుండగా అనుకోకుండా కాలు జారి పడిపోయానని చెప్పారు. ఆ సమయంలో తన పడక గది మంచం పదునైన అంచుకు బలంగా తగలడంతో తీవ్రమైన గాయమైందని వెల్లడించారు.

తాను ఉపయోగించిన మంచం విదేశీ నమూనాలో తయారైనదని, అది నేలకు చాలా దగ్గరగా ఉండటంతో పాటు పదునైన అంచులు కలిగి ఉండేదని ముమైత్ చెప్పారు. ఆధునిక నమూనాల వస్తువులు అంటే ఇష్టముండటంతో అలాంటి మంచాన్ని కొనుగోలు చేశానని, కానీ అదే తనకు పెద్ద ప్రమాదానికి కారణమైందని పేర్కొన్నారు. పడిపోయిన వెంటనే మంచం అంచు బలంగా తగలడంతో శరీరంలో మూడు ప్రధాన నరాలు దెబ్బతిన్నాయని తెలిపారు. ఆ గాయం బయటకు పెద్దగా కనిపించకపోయినా లోపల తీవ్రమైన రక్తస్రావం జరిగిందని ఆమె వివరించారు. గాయం తీవ్రత వెంటనే గుర్తించలేకపోయామని, కొద్దిసేపటికే స్పృహ కోల్పోయానని చెప్పారు. అనంతరం ఆసుపత్రికి తరలించగా దాదాపు పదిహేను రోజుల పాటు కోమాలో ఉన్నానని తెలిపారు. ఆ తర్వాతే స్పృహలోకి వచ్చానని గుర్తుచేసుకున్నారు. తాను స్పృహలోకి వచ్చిన తర్వాత వైద్యులు చెప్పిన విషయాలు మరింత భయపెట్టాయని ముమైత్ వెల్లడించారు. మరో రోజు ఆలస్యమై ఉంటే మూత్ర సంబంధిత ఇన్‌ఫెక్షన్లతో పాటు ఇతర తీవ్రమైన సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరించారని చెప్పారు. చికిత్స సమయంలో శరీరానికి పలు వైద్య పరికరాలు అమర్చాల్సి రావడంతో ఇన్‌ఫెక్షన్ల ముప్పు కూడా ఎక్కువగా ఉండేదని తెలిపారఆ ప్రమాదం తర్వాత పూర్తిగా కోలుకోవడానికి చాలా సమయం పట్టిందని ముమైత్ అన్నారు. శారీరకంగానే కాకుండా మానసికంగా కూడా ఆ ఘటన తనను తీవ్రంగా ప్రభావితం చేసిందని పేర్కొన్నారు. అయినప్పటికీ కుటుంబ సభ్యులు, వైద్యుల సహకారంతో మళ్లీ సాధారణ జీవితంలోకి వచ్చానని తెలిపారు. ఒకప్పుడు ప్రత్యేక గీతాలతో తెలుగు, తమిళ, హిందీ భాషల్లో మంచి గుర్తింపు పొందిన ముమైత్ ఖాన్, తర్వాత పలు రియాలిటీ కార్యక్రమాల్లో కూడా పాల్గొన్నారు. తెలుగు బిగ్‌బాస్ కార్యక్రమంలోనూ సందడి చేసిన ఆమె ప్రస్తుతం సినిమాలకు దూరంగా ఉంటూ అప్పుడప్పుడు టెలివిజన్ కార్యక్రమాల్లో కనిపిస్తున్నారు. ఇటీవల ఇచ్చిన ఈ ఇంటర్వ్యూలో తన జీవితంలో జరిగిన ఈ ప్రమాదాన్ని వెల్లడించడంతో అభిమానులు ఆమె త్వరగా కోలుకుని మళ్లీ వినోద రంగంలో చురుకుగా కనిపించాలని ఆకాంక్షిస్తున్నారు.

